

వాహన తనిఖీల్లో భారీగా నగదు పట్టివేత



మాడ్గి వద్ద తనఖీలు చేస్తున్న పోలీసులు

7లో



- మెదక్ బరిలో 53 మంది అభ్యర్థులు
- వీరంతా పోటీలో ఉంటే నాలుగు ఈవీఎంలు అవసరం
- రేపటితో నామినేషన్ల ఉపసంహరణ పూర్తి
- పలువురిని పోటీ నుంచి తప్పించేలా ప్రయత్నాలు
- బుజ్జగిస్తున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు
- తప్పుకుంటామంటూ కొందరి రాయబారాలు

బుజ్జగింపులు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, ఏప్రిల్ 27 : లోక్‌సభ ఎన్నికల్లో ఆసక్తికరమైన పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ పోటీచేసిన సెగ్మెంట్‌గా, బీఆర్ఎస్ పార్టీకి కంచుకోటగా, పలు ఎన్నికల్లో టీడీపీ, బీజేపీలనూ ఆదరించిన స్థానంగా మెదక్‌కు పేరుంది. అయితే ప్రస్తుతం 53 మంది అభ్యర్థులు నామినేషన్లు వేసిన రికార్డును సైతం సొంతం చేసుకుంది. గడిచిన 2019 ఎన్నికల్లో కేవలం 10 మంది బరిలో నిలిస్తే ఇప్పుడేమో ఐదింతలుగా అభ్యర్థులు నిలవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. అయితే రేపటి వరకు ఉపసంహరణలకు తుది గడువు ఉండడంతో 53 మందిలో పోటీ నుంచి తప్పుకునేదెవరో అనే విషయం కూడా తేటతెల్లమవుతుంది.

తేలనున్న అభ్యర్థులు

పోలింగ్‌కు మరో 16 రోజుల సమయం ఉండగా ప్రచారానికి కేవలం 14 రోజులే ఉంది. రేపు ఉపసంహరణలు పూర్తయితేనే బరిలో నిలిచే అభ్యర్థుల జాబితా సిద్ధమవుతుంది. ఈవీఎంలో అభ్యర్థుల సీరియల్ నంబర్లు, గుర్తులు కేటాయిస్తారు. అంతేగాకుండా ప్రధాన పార్టీల గుర్తులతో పోలిన స్వతంత్రుల గుర్తుల వ్యవహారం కూడా బయటపడుతుంది. అందుకే ఆయా గుర్తులు పొందే పార్టీల అభ్యర్థులతోపాటు పలువురు ముఖ్యమైన స్వతంత్ర అభ్యర్థులను ఉపసంహరించుకునేలా ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. పోటీ నుంచి తప్పుకునేందుకు రేపే చివరి గడువు కావడంతో నేడు తమ ప్రయత్నాలను ముమ్మరం చేయనున్నారు.

బూత్‌కు నాలుగు ఈవీఎంలు..

ప్రస్తుతం నామినేషన్లు వేసిన అభ్యర్థులంతా బరిలో ఉంటే మెదక్ లోక్‌సభకు సంబంధించి ప్రతీ పోలింగ్ బూత్‌కు నాలుగు ఈవీఎంలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని 2,098 పోలింగ్ కేంద్రాల్లో 4 చొప్పున ఈవీఎంలను అందుబాటులో ఉంచక తప్పదు. ఒక ఈవీఎం మెషీన్‌లో 16 మంది అభ్యర్థుల పేర్లు, గుర్తులు మాత్రమే ఉంటాయి. ప్రస్తుతం 53 మంది ఉన్నందున నాలుగు ఈవీఎంలను ఏర్పాటు చేయాల్సిందే. ఇదిలాఉంటే రెండు ఈవీఎంలు ఏర్పాటు చేస్తేనే ఓటర్లు తికమక పడిన సందర్భాలు చాలా ఉన్నాయి. అలాంటిది నాలుగు ఈవీఎంలు పోలింగ్ కేంద్రంలో కనిపిస్తే ఓటర్లు తర్జనభర్జన పడే అవకాశాలు లేకపోలేదు. కనీసం 25 మంది ఉపసంహరించుకుంటే రెండు ఈవీఎంలతో ఎన్నికలు జరపవచ్చు. కానీ ఆ పరిస్థితి కనిపించడం లేదు. చివరగా మూడు ఈవీఎంలను ఏర్పాటు చేసే పరిస్థితి రావచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



ఉపసంహరణలకు ప్రయత్నం..

ప్రస్తుతం 53 మంది నామినేషన్లు వేయగా ఇందులో వివిధ పార్టీలకు సంబంధించి 16 మంది అభ్యర్థులు ఉన్నారు. మిగతా వారంతా స్వతంత్రులుగా బరిలో నిలవడానికి సిద్ధమయ్యారు. అయితే పలు పార్టీలకు సంబంధించిన గుర్తులు ప్రధాన పార్టీల అభ్యర్థుల గెలుపోటములపై ప్రభావం చూపించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. దీంతో అలాంటి పార్టీల తరఫున నామినేషన్లు వేసిన అభ్యర్థులను ఉపసంహరించుకునేలా ప్రయత్నిస్తున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులే తమకు అనుకూల పరిస్థితి కల్పించుకునే దిశగా ఇలాంటి ఆలోచనలు చేస్తున్నారు. గత ఎన్నికల్లో స్వతంత్రులుగా నిలిచిన వారికి కొందరికి వందల సంఖ్యలో ఓట్లు పడగా.. మరికొందరికి వేలల్లో పోలయ్యాయి. వీరెవరో తెలియకున్నా, కనీస ప్రచారం చేయకున్నా భారీగా ఓట్లు పొందారంటే కేవలం ప్రధాన పార్టీల గుర్తులను పోలిన గుర్తులను కేటాయించడం వల్లేనని చెప్పకతప్పదు.

తప్పుకోవడానికీ రాయబారాలు..!

ఎన్నికల బరి నుంచి తప్పుకుంటామంటూ పలువురు రాయబారాలు నెరుపుతున్నట్లుగా సమాచారం ఉంది. కొందరిని ఉపసంహరించుకునేలా ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రయత్నిస్తుండగా.. ఇందుకు రివర్స్‌గా మరికొందరు తామే తప్పుకుంటామంటూ కీలక అభ్యర్థులకు సమాచారం చేరవేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందు కోసం తాము వెచ్చించిన ఖర్చుతోపాటు తమ త్యాగానికి తగిన ప్రతిఫలం కూడా అందుకోవాలని ఆశిస్తున్నారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇలాంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. గతంలోనూ వెలుగులోకి వచ్చాయి. తాజాగా ఉపసంహరణల గడువు ఉండడంతో మరోసారి ఈ అంశం చర్చనీయాంశంగా మారింది.

జహీరాబాద్‌లో బూత్‌కు రెండు ఈవీఎంలు అవసరం

జహీరాబాద్ పార్లమెంట్‌కు సంబంధించి 26 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. 2019 ఎన్నికల్లో నామినేషన్ల ఉపసంహరణ అనంతరం 12 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. ఒక ఈవీఎంలో 16 పేర్లకు అవకాశం ఉండగా, నాడు ఒకే ఈవీఎం సరిపోయింది. ఈసారి మాత్రం 40 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా 14 మంది నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. మిగిలిన 26 మంది అభ్యర్థుల్లో ఎంతమంది ఉపసంహరించుకుంటారో చూడాలి. ఒకవేళ ఉపసంహరణ అనంతరం కూడా 16 మందికిపైగా అభ్యర్థులు బరిలో నిలిస్తే రెండు ఈవీఎంలు అవసరం పడతాయి. నియోజకవర్గ పరిధిలోని ప్రతీ పోలింగ్ బూత్‌లో రెండేసీ ఈవీఎంల చొప్పున ఏర్పాటు చేయాల్సి వస్తుంది.

ప్రతీ ఓటరుకు పోల్ చీటీ

- పంపిణీ ప్రారంభించిన బీఎల్వోలు
- మే 8వ తేదీ వరకు కొనసాగనున్న ప్రక్రియ
- మెదక్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో 2,098 పోలింగ్ కేంద్రాలు, 18,19,397 మంది ఓటర్లు



బండాపోసాన్‌పల్లిలో పోల్ చీటీలు అందజేస్తున్న బీఎల్వో

మెదక్ అర్బన్, ఏప్రిల్ 27: పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచడమే లక్ష్యంగా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా పోల్‌చీటీల పంపిణీకి శ్రీకారం చుట్టింది. బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు పోల్‌చీటీలు అందజేస్తున్నారు. మెదక్ పార్లమెంట్ పరిధిలో మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి, దుబ్బాక, గజ్వేల్, నర్సాపూర్, పటాన్‌చెరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 2,098 పోలింగ్ కేంద్రాలున్నాయి. 18,19,397 మంది ఓటర్లు ఉండగా.. పురుషులు 8,97,788, మహిళలు 9,21,400, ఇతరులు 209 మంది ఉన్నారు. రెవెన్యూ అధికారులు సూచించినట్లు వీరందరికీ బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి పోల్‌చీటీలు అందజేస్తున్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువు మే 8వ తేదీ కాగా.. 2వ తేదీ వరకే ప్రతీ ఓటరుకు పోలీ చీటీ పంపిణీ చేసేలా ఆయా గ్రామాల బీఎల్‌వోలు ముందుకెళ్తున్నారు.

చీటీలోనే పూర్తి వివరాలు

ఎన్నికల్లో ఓటు వేసేందుకు పోల్‌చీటీలు ఎంతో ఉపయోగపడతాయి. ఓటరు పేరు, తండ్రి/భర్త పేరు, పోలింగ్ కేంద్రం పేరు, సంఖ్య, చిరునామా, ఓటరు జాబితాలోని సంఖ్య తదితర వివరాలతోపాటు సంబంధిత బీఎల్వో పేరు, ఫోన్‌నంబర్, ఓటర్లకు పోలింగ్ కేంద్రాల్లో కల్పిస్తున్న సౌకర్యాలు, పోలింగ్ రోజున ఓటర్లు పాటించాల్సిన నిబంధనలు ఈ చీటీలో ఉంటాయి. ఓటర్ల సమాచారంతో పాటు తమ పరిధిలోని ఏవైనా ఎన్నికల ఉల్లంఘనలు జరిగినా, రాజకీయ పార్టీలు ఓటర్లను ప్రలోభాలకు గురిచేసినా వెంటనే అధికారుల దృష్టికి తీసుకువచ్చేలా పోల్ చీటీలపై తెలంగాణ రాష్ట్ర ఎన్నికల అధికారిక వెబ్‌సైట్, 1950 టోల్‌ఫ్రీ నంబర్ కూడా ముద్రించి ఉంది. వీటిని గతంతో రాజకీయ పార్టీలే ముద్రించి పోలింగ్‌కు ముందు రోజు తమ గుర్తులున్న కరపత్రాలను పంచేవారు. అవి పూర్తిస్థాయిలో ఓటర్లకు అందక ఇబ్బందులు పడేవారు. ముఖ్యంగా నిరక్షరాస్యులు, వృద్ధులకు ఇబ్బందులు ఏర్పడేవి. దీంతో ఓటర్లు సులువుగా పోలింగ్ కేంద్రాలకు చేరుకొని ఓటు హక్కు వినియోగించుకునేలా ఎన్నికల సంఘమే వీటిని ముద్రించి పంపిణీ చేస్తున్నది.

ఓటేసేలా చర్యలు

పార్లమెంట్ ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకు అవసరమైన పోల్‌చీటీలను బీఎల్వోలు ఓటర్ల ఇంటింటికీ వెళ్లి అందజేస్తున్నారు. వచ్చే నెల 8 వరకు పంపిణీకి గడువు ఉన్నప్పటికీ ముందుగానే పంపిణీ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

\- జి.వెంకటేశ్వర్లు, మెదక్ అదనపు కలెక్టర్

నేటి నుంచి ఎన్నికల సిబ్బందికి శిక్షణ

గైర్హాజరైతే కఠిన చర్యలు : జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి



వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 27: లోక్‌సభ ఎన్నికల పోలింగ్ మే 13న జరగనున్న నేపథ్యంలో జహీరాబాద్ నియోజకవర్గ ఎన్నికల సిబ్బందికి ఈ నెల 28, వచ్చే నెల 1, 2, 7, 8 తేదీల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి శనివారం ప్రకటనలో తెలిపారు. సంగారెడ్డి పట్టణ శివారులోని పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని పీఎస్ఆర్ గార్డెన్‌లో ఈ నెల 28న ఈవీఎంలపై ఏఆర్‌వోలు, ఆర్‌వోలు, సెక్టోరియల్ అధికారులు, ఏఎల్ఎంటీలు ఇతర సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వచ్చే నెల 1, 2, 7, 8 తేదీల్లో రెండు విడతల్లో సిబ్బందికి కేటాయించిన అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ఆయా తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ కొనసాగుతుందని తెలిపారు. ఎన్నికల విధులు కేటాయించిన ఉద్యోగులందరూ తప్పనిసరిగా శిక్షణ కార్యక్రమాలకు హాజరుకావాలని ఆదేశించారు. శిక్షణకు గైర్హాజరయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పోలీసులు 24/7 అందుబాటులో ఉండాలి

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు : సంగారెడ్డి ఎస్పీ రూపేష్



పోలీసు అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ చెన్నూరి రూపేష్


సంగారెడ్డి క్రైం, ఏప్రిల్ 27: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా అధికారులు, సిబ్బంది 24/7 అందుబాటులో ఉండాలని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం సాయంత్రం పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ ప్రాంతంలోని గల పోలింగ్ కేంద్రాల రూట్‌మ్యాప్, పోలింగ్ కేంద్రాలు తెలిసి ఉండాలన్నారు. అధికారులు, సిబ్బంది వివిధ శాఖలకు చెందిన అధికారులతో సమన్వయపరుస్తూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి కృషి చేయాలని సూచించారు. జిల్లాలో ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా చెక్ పోస్టుల నిర్వహణ ఉండాలని సూచించారు. డబ్బు, మద్యం రవాణా జరిగితే జిల్లా ప్రజలు నేరుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

సూర్య ప్రతాపం

సిద్దిపేటలో 44.3 డిగ్రీలు

మెదక్‌లో 43.6 డిగ్రీలు, సంగారెడ్డిలో 43.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు

కొనసాగుతున్న ఆరెంజ్ అలర్ట్



మెదక్, ఏప్రిల్, 27: ఉమ్మడి మెదక్ జిల్లాలో సూర్య ప్రతాపం కొనసాగుతున్నది. ఉక్కబోత, వడగాలులకు జనాలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 44 డిగ్రీలు దాటాయి. గత నాలుగు రోజులుగా ఉమ్మడి జిల్లాలో ఆరెంజ్ అలర్ట్ కొనసాగుతున్నది. ఉమ్మడి జిల్లాలోనే అత్యధికంగా సిద్దిపేట జిల్లా తొగుట మండలం తుక్కాపూర్‌లో శనివారం 44.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దౌమ్మాటలో 44 డిగ్రీలు, సిద్దిపేట అర్బన్ మండలంలో 43.8 డిగ్రీలు, మెదక్ జిల్లా పాపన్నపేటలో 43.6 డిగ్రీలు, సంగారెడ్డి జిల్లా కొండాపూర్‌లో 43.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాబోయే మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింతగా పెరుగుతాయని వాతావరణశాఖ తెలిపింది. మధ్యాహ్నం ఇళ్ల నుంచి బయటకు వెళ్లొద్దని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వృద్ధులు, గర్భిణులు, చిన్నపిల్లలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. కూలీలు మండుటెండల్లో పనులు చేయొద్దని, ఉదయం, సాయంత్రం వేళల్లో పనులు చేసుకుని ఆరోగ్యం కాపాడుకోవాలని పేర్కొంటున్నారు. నీటి శాతం ఎక్కువగా ఉన్న పండ్లు, కూరగాయలు తినాలని సూచిస్తున్నారు. తక్కువ చక్కెరతో కూడిన పండ్లరసాలు, నీరు, మజ్జిగ, కొబ్బరినీళ్ల తాగాలని చెబుతున్నారు. తప్పనిసరిగా బయటకు వెళ్లాల్సివస్తే గొడుగు లేదా టోపీ, చలువ కళ్లద్దాలు, శరీరమంతా కప్పేలా దుస్తులు ధరించి బయటకు వెళ్లాలని సూచిస్తున్నారు.



మెదక్‌లో నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు

గెలిపిస్తే సేవ చేస్తా

- బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి 7లో

కేంద్రంలో కాంగ్రెస్ వస్తే శాంతికి విఘాతం

- బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు 7లో

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

- బీజేపీ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ 7లో

ఊబచెరువు కట్టకు లీకేజీలు

- వెంచర్‌కు రోడ్డు కోసం కట్టను తవ్వేయడంతోనే..
- హడావుడిగా మట్టిపోస్తున్న రియల్టర్లు
- వారం క్రితమే హెచ్చరించిన 'ఆంధ్రజ్యోతి'
- ఈ నెల 21న 'ఊబ చెరువకు ఉరి' కథనం
- పట్టించుకోని అధికారులు
- ఎన్నికల విధుల పేరిట తప్పించుకునే యత్నం

ప్రమాదపుటంచున!

సదాశివపేట, ఏప్రిల్ 27: ఊబ చెరువు ప్రమాదంలో పడింది. 'ఆంధ్రజ్యోతి'లో ఈ నెల 21న ప్రచురితమైన కథనం అక్షర సత్యంగా తేలింది. వెంచర్ కోసం అడ్డంగా తవ్వేయడంతో చెరువు కట్టకు లీకేజీలు ఏర్పడ్డాయి. పలుచోట్ల నీరు బయటకు వస్తున్నది. చెరువు ప్రమాదంలో పడిన విషయంపై వారం రోజుల క్రితమే 'ఆంధ్రజ్యోతి' హెచ్చరించినా అధికారులు పట్టించుకోక పోవడంతో ఇప్పుడు చెరువుకు గండి పడే ప్రమాదం ఏర్పడింది. రియల్టర్లు, అధికారులు కలిసి చెరువుకట్టకు ఏర్పడిన లీకేజీలను కప్పిపుచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ప్రభుత్వం రూ.10 కోట్లు ఖర్చు చేసి చెరువుకట్టను మినీట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దితే వెంచర్ కోసం ధ్వంసం చేయడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

చెరువుకట్టకు ప్రైవేటు వ్యక్తుల మరమ్మతులు

ఊబచెరువు కట్టకు లీకేజీలు ఏర్పడడంతో చెరువుకట్ట బఫర్ జోన్‌ను ఆక్రమించి వెంచర్‌కు రోడ్డును నిర్మించిన విషయం బయటకు వస్తుందని రియల్టర్లు అప్రమత్తమయ్యారు. చెరువు కట్ట పొడవునా లీకేజీలు ఏర్పడిన చోట్ల మట్టిని పోసి లీకేజీను కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇరిగేషన్‌శాఖ ఆధ్వర్యంలో నిపుణులైన ఇంజనీర్లు శాస్త్రీయంగా అధ్యయనం చేసి కట్టను బలోపేతం చేయాల్సి ఉండగా.. అందుకు విరుద్ధంగా ప్రైవేటు వ్యక్తులు మరమ్మతులు చేయడం గమనార్హం. ప్రైవేటు వ్యక్తులు ఇష్టారీతిన కట్టను తవ్వేసినా పట్టించుకోని ఇరిగేషన్‌శాఖ అధికారులు.. కనీసం లీకేజీలు ఏర్పడినా స్పందించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రైవేటు వ్యక్తులు మరమ్మతులు చేస్తుంటే సంబంధితశాఖ అధికారులు చోద్యం చూస్తున్నారా? అని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోని ఇరిగేషన్‌శాఖ

ఊబచెరువుకట్టను రియల్టర్లు ధ్వంసం చేస్తున్నప్పటికీ నీటిపారుదలశాఖ అధికారులు కన్నెత్తి చూడడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రియల్టర్లు ఏకంగా చెరువుకట్టను, బఫర్‌జోన్‌ను ఆక్రమించి వెంచర్ కోసం రోడ్డును నిర్మించినా పట్టించుకోలేదని మండిపడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా చెరువుకట్టపై లేఅవుట్‌కు సంబంధించిన జెండాలు, భారీసైజు ఫ్లెక్సీలు ఏర్పాటుచేయడమే కాకుండా నిత్యం భారీ వాహనాలు రాకపోకలు కొనసాగిస్తున్నా అధికారులు చెరువును పరిశీలించిన పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు ఏకంగా చెరువుకట్టకు లీకేజీలు ఏర్పడి చెరువులోని నీరంతా కిందికి వెళ్తున్నా స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తున్నదని అంటున్నారు. చెరువులో నీరు లేకుండా చేసి ఏకంగా చెరువునే కబ్జా చేయాలనే ఆలోచనలో సంబంధిత నాయకులు ఉన్నారని, ఈ కుట్రకు అధికారులు సహకరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఊబచెరువును కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.





ఊబచెరువు కట్ట నుంచి బయటకు వస్తున్న నీరు, వెంచర్‌లోకి నీరు వెళ్లకుండా అపేందుకు పోసిన మట్టి

ఫినాయిల్ తాగిన వృద్ధురాలు మృతి

రాయపోల్, ఏప్రిల్ 27: మంచినీళ్ల డబ్బా పక్కన ఉన్న ఫినాయిల్ తాగిన ఓ వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతిచెందింది. రాయపోల్ ఎస్ఐ రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. రాయపోల్‌కు చెందిన పంబాల నర్సమ్మ(75) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నది. ఈ నెల 9న మంచినీళ్ల డబ్బా పక్కన ఉన్న ఫినాయిల్ డబ్బా తీసుకొని తాగింది. ఈ విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది. శనివారం మృతురాలి కోడలు భారతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వెండి వస్తువులు చోరీ

కౌడిపల్లి, ఏప్రిల్ 27: షాపులో వస్తువులు కొనుగోలు చేస్తామని నమ్మించి 50 తులాల వెండి వస్తువులు దొంగిలించిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిని ఆనుకుని ప్రేమ్ అనే వ్యక్తి రాందేవ్ ఫౌన్ బ్రోకర్‌షాపు నిర్వహిస్తున్నాడు. గురువారం చిన్న పిల్లలను షాపులో ఉంచి భోజనానికి వెళ్లాడు. కొందరు వ్యక్తులు షాపులోకి వచ్చి 30 తులాల వెండి కడియాలు, 20 తులాల కాళ్ల పట్టీలను దొంగిలించుకుపోయారు. యజమానికి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



వెండికోల్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బీజేపీ జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బీబీ పాటిల్



పెద్దశంకరంపేట: బీబీపాటిల్ సమక్షంలో బీజేపీలో చేరుతున్న కమలాపూర్, చీలపల్లి గ్రామాలకు చెందిన పలువురు యువకులు

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

- జహీరాబాద్‌ను మోదీకి బహుమతిగా ఇద్దాం
- బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి బీబీ పాటిల్

పుల్‌కల్, ఏప్రిల్ 27: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని బీజేపీ జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బీబీ పాటిల్ పిలుపునిచ్చారు. మండల కేంద్రం పుల్కల్‌తో పాటు వెండికోలు గ్రామంలో శనివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. పదేళ్లుగా జహీరాబాద్ ఎంపీగా ప్రజలకు సేవలందించానని, రాజకీయ పరిస్థితుల దృష్ట్యా బీజేపీలో చేరి మూడో సారి పోటీ చేస్తున్నానని తెలిపారు. మోదీ అండదండలతో తాను హ్యాట్రిక్ ఎంపీగా గెలుపొంది రికార్డు బ్రేక్ చేస్తానని ఆయన ధీమా వ్యక్తం చేశారు. జహీరాబాద్ పార్లమెంట్ స్థానాన్ని మోదీకి బహుమతిగా ఇవ్వాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161 జాతీయ రహదారి కేంద్ర ప్రభుత్వం అండతోనే నాలుగు లైన్లుగా విస్తరణ చేపట్టానని గుర్తు చేశారు. కాగా వెండికోలు బీఆర్‌ఎస్ గ్రామ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ భోజన్నగారి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో గ్రామ అధ్యక్షుడు నీరుడి మహేశ్‌ముదిరాజ్, నాయకులు బేగరి కుమార్, కిష్టయ్య, పద్మయ్య, సిరిపురం లక్ష్మయ్య, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పాండుతో పాటు మరో 50 మంది అనుచరులు బీబీపాటిల్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతరావుకులకర్ణి, నాయకులు ఏ.వెంకటనర్సింహారెడ్డి, పల్వట్ల జగదీశ్వర్, రమేశ్‌బస్వరాజ్‌పాటిల్, మంఠం చంద్రశేఖర్, చౌటకూర్, పుల్కల్ మండలాల అధ్యక్షులు నీరుడి ప్రవీణ్‌కుమార్‌ముదిరాజ్, పండరి పాల్గొన్నారు.

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ ఏర్పాటు ఖాయం

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 27: పార్లమెంట్ ఎన్నికల్లో 400కు పైగా స్థానాలు గెలుచుకొని మూడోసారి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని బీజేపీ జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బీబీ పాటిల్ అన్నారు. శనివారం బీజేపీ మండలాధ్యక్షుడు కోణం విఠల్ ఆధ్వర్యంలో చీలపల్లి, కమలాపూర్, గ్రామాలకు చెందిన 50 మందికి పైగా యువకులు బీబీపాటిల్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా యువకులు, మహిళలు అన్నివర్గాల ప్రజలు బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారు. గ్రామాల్లో బీజేపీ కార్యకర్తలు, నాయకులు ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను వివరిస్తూ మూడోసారి కమలం గుర్తుకు ఓటువేసి గెలిపించాలని కోరాలని పిలుపునిచ్చారు. జహీరాబాద్ ఎంపీగా తనను ఆశీర్వదించి గెలిపిస్తే ఈ ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు, మాజీ సర్పంచులు అశోక్, సూర్యప్రకాష్, శ్రీశైలం, శ్రావణ్‌కుమార్, మంగలికృష్ణ, గంగారెడ్డి, చీలపల్లి, కమలాకర్ గ్రామాలకు చెందిన రోషిరెడ్డి, కృష్ణారెడ్డి, గంగయ్య, దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే శాంతిభద్రతలకు విఘాతం

- బీఆర్‌ఎస్‌తో ప్రజలకు ఒరిగేది ఏమీ లేదు
- బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావు

కొల్చారం, ఏప్రిల్ 27: కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దేశంలో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని, బీఆర్‌ఎస్ పదేళ్ల కాలంలో రాష్ట్రంలో అవినీతి పాలన సాగిందని బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. శనివారం మెదక్ జిల్లా కొల్చారం మండల పరిధిలోని దుంపలకుంట చౌరస్తా, రంగంపేట, కొల్చారంలో జరిగిన కార్నర్ సమావేశంలో పాల్గొన్నారు. అలాగే సంగాయిపేట, చిన్నాఘనపూర్, పోతంశెట్‌పల్లి చౌరస్తా, అప్పాజిపల్లి మీదుగా రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి రాగానే రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి మాట మారుస్తూ రుణమాఫీని వాయిదాల మీద వాయిదాలు వేస్తూ దేవుళ్లపై ఒట్లు వేస్తున్నాడని అన్నారు. అలాగే పదేళ్లకాలంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో రుణమాఫీ చేయని మంత్రి హరీశ్‌రావు రాజీనామా అంటూ కొత్త నాటకం ఆడుతున్నాడని విమర్శించారు. ఈ సమావేశంలో నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి మురళీయాదవ్, బీజేపీ మండలాధ్యక్షుడు పాతూరి దయాకర్‌గౌడ్, రాంపూర్ మాజీ సర్పంచ్ సామల యాదగిరి, బీజేపీ నాయకులు హరీశ్, గిరి, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.



కొల్చారంలో మాట్లాడుతున్న రఘునందన్‌రావు

రేవంత్ మాటలన్నీ నీటి మూటలే!

చిలప్‌చెడ్, ఏప్రిల్ 27: సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిన మాటలన్నీ.. నీటి మూటలేనని బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు ఎద్దేవా చేశారు. శనివారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆయన రోడ్‌షో నిర్వహించగా.. ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు ఎంతవరకు అమలు చేశారని ప్రశ్నించారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన వాగ్దానం ఏమైందని గుర్తుచేశారు. వృద్ధులకు రూ.4 వేల పింఛన్ ఇస్తానన్న సీఎం ఇంతవరకు అమలు చేశాడా.. అని ప్రశ్నించారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజలకు ఎన్నో సేవలు చేసిందన్నారు. గ్రామాల్లో జరిగిన అభివృద్ధి కేంద్ర ప్రభుత్వం చేసిందేనని గుర్తుచేశారు. దేశం సురక్షితంగా ఉండాలంటే కేంద్రంలో బీజేపీ ప్రభుత్వమే ఉండాలన్నారు.



చిలప్‌చెడ్‌లో నిర్వహించిన రోడ్‌షోలో మాట్లాడుతున్న రఘునందన్‌రావు

ప్రజలు పెద్ద మనసుతో నిజానిజాలు గమనించి మాయమాటలకు లోనుకాకుండా బీజేపీకి ఓటేసి.. తనను గెలిపించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మురళీయాదవ్, బీజేపీ మండలాధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్, ఆయా మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు నాయకులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

మోదీకి ఓటేసి గెలిపించాలి

కొడిపల్లి, ఏప్రిల్ 27: దేశం అభివృద్ధి చెందాలంటే నరేంద్రమోదీకి ఓటేసి గెలిపించాలని బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. శనివారం శనివారం మండల కేంద్రంలో భారీ రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఆరు గ్యారంటీలు అమలు చేసిందా.. అని ప్రచారానికి వచ్చిన వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు మురళీధర్‌యాదవ్, జిల్లా నాయకులు ఖాజీపేట రాజేందర్, గోడ రాజేందర్, బీజేపీ మండలాధ్యక్షుడు రాకేష్‌తో పాటు వివిధ గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.

సివిల్ ర్యాంకర్‌కు ఎమ్మెల్సీ సత్కారం

కొండపాక, ఏప్రిల్ 27: కొండపాకకు చెందిన సివిల్ ర్యాంకర్ బుద్ధి అఖిల్‌ను ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి శనివారం కొండపాకలోని ఆయన స్వగృహంలో ఘనంగా సత్కరించి మాట్లాడారు. అఖిల్ సివిల్స్‌కు ఎంపికకావడం గ్రామీణ ప్రాంతంలో ఉన్న ఎంతోమంది విద్యార్థులకు ఆదర్శంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లుగారి ఇంద్రసేనారెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నర్రా భాస్కర్ రెడ్డి, కొండపాక మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నర్రా జైపాల్‌రెడ్డి, పీఆర్టీయూ నాయకులు వెంకటరమణ, తిరుపతి పాల్గొన్నారు.



అఖిల్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

ఆశీర్వదించి గెలిపిస్తే.. పేదలకు సేవలందిస్తా..

- బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి

గజ్వేల్, ఏప్రిల్ 27: ఆశీర్వదించి గెలిపిస్తే.. అందరికీ సేవలందిస్తానని బీఆర్‌ఎస్‌మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి అన్నారు. గజ్వేల్ పట్టణంలోని బస్టాండ్ ప్రాంగణం, సమీకృత మార్కెట్, దుకాణాలు తదితర ప్రాంతాల్లో నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్రామారెడ్డి మాట్లాడుతూ అధికారిగా పనిచేసిన ప్రాంతం నుంచి ఎంపీగా పోటీచేసే అవకాశం దక్కడం గొప్ప విషయమన్నారు. ఎంపీగా ఆశీర్వదించి పార్లమెంట్‌కు పంపిస్తే మెదక్ అభివృద్ధి కోసం కృషిచేస్తానని చెప్పారు. మెదక్ పార్లమెంట్ పరిధి ప్రజల రుణం తీర్చుకునేందుకు తన ఉమ్మడి కుటుంబ ఆస్తి నుంచి రూ.100 కోట్లతో ట్రస్ట్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు చేస్తానని హామీనిచ్చారు. కాంగ్రెస్ నుంచి నిలకడ లేని మనిషి, బీజేపీ నుంచి ప్రగల్భాలు పలికే వ్యక్తి పోటీచేస్తున్నారని, జాగ్రత్తగా ఆలోచించి ఓటు వేయాలన్నారు. అలవిగాని హామీలు ఇచ్చి మోసం చేసినందుకు బీజేపీ అభ్యర్థిని గతంలో దుబ్బాకలో ప్రజలు చిత్తుగా ఓడించిన విషయాన్ని గుర్తుచేశారు. తాను ఇచ్చిన మాట కోసం ప్రాణమైనా ఇస్తానని చెప్పారు. ఎంపీగా గెలిపిస్తే ఐదేళ్ల పాటు నిస్వార్థంగా ప్రజలకు సేవ చేస్తానని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో అందరం కారు గుర్తుకు ఓటు వేసి గెలిపిస్తామని దీవించారన్నారు. కేసీఆర్ ఉన్నప్పుడు మంచిగా ఉండేనని, కాంగ్రెస్ పాలనలో రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు, మహిళలకు, వృద్ధులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ విస్మరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ చైర్మన్ రాజమౌళి, కౌన్సిలర్లు, నాయకులు ఉన్నారు.



గజ్వేల్‌లోని సమీకృత మార్కెట్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వెంకట్రామారెడ్డి

వెంకట్రామారెడ్డి వాహనం తనిఖీ

కొండపాక, ఏప్రిల్ 27: దుద్దెడ శివారులోని టోల్ ప్లాజా చెక్‌పోస్ట్ వద్ద వెంకట్రామారెడ్డి వాహనాన్ని మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ దుర్గ ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం సాయంత్రం తనిఖీ చేశారు.

కాంగ్రెస్‌లోకి భారీగా వలసలు

- సీఎం సమక్షంలో పార్టీలో పలువురి చేరిక

తూప్రాన్, ఏప్రిల్ 27: కాంగ్రెస్ పార్టీలో చేరికల జోష్ పెరిగింది. తూప్రాన్ పట్టణ మాజీ సర్పంచ్ రాముని గారి వీర్‌కుమార్ గౌడ్, మాజీ వార్డుసభ్యులు బొల్లు వెంకటేశ్, అల్లాపురం సిద్ధిరాములు కాంగ్రెస్‌లో చేరారు. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరగా, సీఎం రేవంత్‌రెడ్డి కండువాలు కప్పి ఆహ్వానించారు. కాగా తూప్రాన్ మున్సిపల్ వైస్ చైర్మన్ నందా శ్రీనివాస్, కౌన్సిలర్ రాముని గారి శ్రీశైలంగౌడ్, మత్స్యశాఖ డైరెక్టర్ గడప దేవేందర్, పట్టణ అధ్యక్షుడు పల్లెర్ల రవీందర్‌గుప్తా, నాయకులు మామిండ్ల కృష్ణ, నాగరాజుగౌడ్ సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు.

సొంత గూటికి కౌన్సిలర్

గజ్వేల్, ఏప్రిల్ 27: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీకి చెందిన 13వ వార్డు కౌన్సిలర్ షెహనాజ్ సమీర్ తిరిగి సొంత గూటికి చేరారు. శనివారం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో డీసీసీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. 2020లో జరిగిన మునిసిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున గెలిచిన కౌన్సిలర్ అనంతరం బీఆర్‌ఎస్‌లో చేరారు. తాజాగా నర్సారెడ్డి ఆధ్వర్యంలో సొంత గూటికి చేరుకున్నారు. ఆయన వెంట వార్డుకు చెందిన నాయకులు ఉన్నారు.

కుకునూర్‌పల్లి మండలం నుంచి...

కుకునూర్‌పల్లి, ఏప్రిల్ 27: గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కుకునూరుపల్లి మండలానికి చెందిన మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, పలువురు నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కుకునూరుపల్లి మాజీ సర్పంచ్ పోల్కంపల్లి జయంతినరేందర్, ముద్దాపూర్ మాజీ సర్పంచ్ కుమారుడు శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు ఇండ్ల కనకయ్య, తూం మహేందర్ పార్టీలో చేరినవారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఐలం యాదవ్, రెడ్డమైన రవీందర్, నరసింహాచారి, రవీందర్, కిష్టారెడ్డి పాల్గొన్నారు.



సమీర్‌కు కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

పిల్లలు లేని దంపతులు దత్తత తీసుకోవాలి

- సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్



పాపను దత్తత ఇస్తున్న అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

సిద్దిపేట అగ్రికల్చర్, ఏప్రిల్ 27: పిల్లలు లేని దంపతులు దత్తత తీసుకోవాలని సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ సూచించారు. శనివారం పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన దంపతులకు జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఆరునెలల వయస్సు గల పాపను సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అధికారికంగా దంపతులకు అందజేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలను దత్తతకు తీసుకోవాలంటే సిద్దిపేటలో గల శిశు గృహ/జిల్లా బాలల పరిరక్షణ విభాగం ద్వారా అధికారికంగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సావిత్రి, బాల రక్ష భవన్ కోఆర్డినేటర్ మమత, జిల్లా బాలల పరిరక్షణ అధికారి రాము, ప్రొటెక్షన్ ఆఫీసర్ రాజు, శిశు గృహ మేనేజర్ ఝాన్సీ పాల్గొన్నారు.

పని చేయడం లేదని ఘర్షణ

- కొడుకుపై తండ్రి దాడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

తూప్రాన్, ఏప్రిల్ 27: పని చేయకుండా తిరగొద్దని తండ్రి హెచ్చరించడంతో చోటు చేసుకున్న ఘర్షణలో కొడుకుపై తండ్రి దాడిచేయగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్ఐ శివానందం వివరాల ప్రకారం.. తూప్రాన్ పట్టణ పరిధి ఆబోతుపల్లికి చెందిన పోడేటి రాజుకు ఇద్దరు భార్యలు, ఇద్దరు కుమారులు, ఓ కూతురు.. ఇద్దరు భార్యలు అనారోగ్యంతో మృతిచెందారు. పెద్ద కుమారుడికి పెళ్లి కాగా.. కొల్గూరులో అత్తగారి ఇంటి వద్ద ఉంటున్నాడు. కూతురు సంధ్య మాసాయిపేటలో అమ్మగారింటి వద్ద ఉంటుంది. చిన్న కుమారుడు పోడేటి నరేష్(23), తండ్రి రాజు తూప్రాన్ పట్టణంలోని ఇటీవల మంజూరైన డబుల్ బెడ్‌రూం ఇంట్లో ఉంటున్నారు. నరేష్ ఏ పని చేయకుండా తిరగడంతో తండ్రీ, కొడుకుల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈనెల 25న రాత్రి 8 గంటలకు కూడా పని విషయంలో గొడవ జరిగింది. దీంతో తండ్రి రాజు కొడుకు నరేష్‌ను ఇటుక, బీరు సీసాతో కొట్టాడు. తీవ్రంగా గాయపడిన నరేష్‌ను సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా, శుక్రవారం మృతిచెందాడు. శనివారం రాజు సోదరుడు స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానందం పేర్కొన్నారు.



నరేష్(ఫైల్)

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

- హెల్త్ డైరెక్టర్ రవీంద్రనాయక్ సూచన



ప్రసూతి గదిని పరిశీలిస్తున్న హెల్త్ డైరెక్టర్ రవీంద్రనాయక్

కుకునూరుపల్లి, ఏప్రిల్ 27: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలని రాష్ట్ర ప్రజా ఆరోగ్యం, కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్ రవీంద్రనాయక్ సూచించారు. శనివారం కుకునూరుపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఐపీవోపీ ల్యాబ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రసూతి గదిని పరిశీలించారు. ఏప్రిల్‌లో జరిగిన ప్రసూతి, ఫార్మసీలో ఉన్న మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు స్టాక్ మెయింటనెన్స్ ఉండాలని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యసేవలు అందుతున్నాయా.. అని రోగులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి పనికి వెళ్లి వడదెబ్బతో ఆస్పత్రికి వచ్చిన రోగితో మాట్లాడుతూ ఇంట్లోనే ఓఆర్ఎస్ ఎలా తయారు చేసుకోవాలో, వేసవిలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ఆయన వెంట డీఎంహెచ్ఓవో పి.శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, ఏవో రవీందర్, వైద్యులు బల్వీర్‌సింగ్, నమ్రిత్ సిబ్బంది ఉన్నారు.

న్యాయం చేయాల్సిందే

- చెప్యాలలో ఇంటిముందు మృతదేహంతో నిరసన

మిరుదొడ్డి: మిరుదొడ్డి మండలం చెప్యాలకు చెందిన అక్కరాజు నర్సింహులు(39) ఈనెల 25న రాత్రి 11 గంటలకు దొమ్మాట నుంచి చెప్యాలకు వస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన అక్కరాజు స్వామి ఎదురెదురుగా బైక్‌లతో ఢీకొనడంతో నర్సింహులు అక్కడికక్కడే మృతిచెందిన విషయం తెలిసిందే. శనివారం కుటుంబ సభ్యులు నర్సింహులు మృతదేహాన్ని స్వామి ఇంటి ఎదుట ఉంచి నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న దుబ్బాక సీఐ శ్రీనివాస్, ఎస్ఐ పరశురాములు ఘటనా స్థలానికి చేరుకున్నారు. బాధిత కుటుంబసభ్యులను సముదాయించే ప్రయత్నం చేశారు. తమకు న్యాయం జరిగేవరకూ మృతదేహాన్ని తీసేది లేదని భీష్మించి కూర్చున్నారు. ఎట్టకేలకు బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో మృతదేహాన్ని తీశారు. మృతుడికి భార్య స్వప్న, ముగ్గురు కుమారులున్నారు.

వాహన తనిఖీల్లో భారీగా నగదు పట్టివేత

మిరుదొడ్డి, ఏప్రిల్ 27: ఎన్నికల నేపథ్యంలో నిర్వహిస్తున్న వాహన తనిఖీల్లో భారీగా నగదు, మద్యం పట్టుబడుతున్నది. మిరుదొడ్డి మండలం చెప్యాల చౌరస్తాలో శనివారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రూ.3,52,300 లక్షలు పట్టుబడినట్టు మిరుదొడ్డి ఎస్ఐ పరశురాములు తెలిపారు. దౌల్తాబాద్ మండలం నర్సంపల్లి గ్రామానికి చెందిన రాజు నుంచి రూ.54,800 వేలు, మర్కుక్ మండలానికి చెందిన బీరప్ప నుంచి రూ.2,04,600 లక్షలు, దౌల్తాబాద్ మండలం మల్లేశంపల్లి గ్రామానికి చెందిన కుర్వ యాదగిరి వద్ద రూ.92,900 వేలను సీజ్ చేసినట్టు తెలిపారు.

మద్దూరులో రూ.1,76,340 లక్షలు..

మద్దూరు, ఏప్రిల్ 27: మద్దూరు మండలంలో పోలీసులు చేపట్టిన వాహన తనిఖీల్లో రెండు వాహనాల్లో తరలిస్తున్న రూ.1,76,340 లక్షల నగదును సీజ్ చేశారు. ఈ విషయమై ఎస్ఐ షేక్ యూనస్ అహ్మద్ అలీ మాట్లాడారు. శుక్రవారం రాత్రి రేబర్తి శివారు క్రాసింగ్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. కాగా చేర్యాల మండలం వేచరేణి గ్రామానికి చెందిన పొలెబోయిన సత్యనారాయణ వాహనంలో తనిఖీ చేయగా.. రూ.1,01,640 లక్షలు లభించాయి. అలాగే శనివారం ఉదయం మద్దూరు కమాన్ వద్ద చేపట్టిన వాహనాల తనిఖీల్లో జనగామ జిల్లా నర్మెట మండలం మచ్చుపహాడ్‌కు చెందిన బానోతు నవీన్ వాహనంలో రూ.74,700 వేలు లభించాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ జగదీశ్వర్, కానిస్టేబుల్ సిద్ధు పాల్గొన్నారు.

బెజ్జంకిలో రూ.1,06,140 లక్షలు..

బెజ్జంకి, ఏప్రిల్ 27: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా పోలీసులు బెజ్జంకి మండలంలో ని రాజీవ్ రహదారిపై చేపట్టిన వాహన తనిఖీల్లో రూ.1,06,140 లక్షలు పట్టుబడినట్లు ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపారు.

మాడ్గి చెక్‌పోస్టు వద్ద రూ.99,500 వేలు..

జహీరాబాద్, ఏప్రిల్ 27: మొగుడంపల్లి మండలంలోని మాడ్గి చెక్‌పోస్టు వద్ద శనివారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. మహారాష్ట్రకు చెందిన సంతోష్ తన కారులో తెలంగాణకు తీసుకొస్తున్న రూ.99,500 పట్టుకున్నామని చిరాగ్‌పల్లి ఎస్ఐ నరేష్ తెలిపారు.

గుర్జకుంట వద్ద రూ.65వేలు..

చేర్యాల, ఏప్రిల్ 27: కొమురవెల్లి ఎస్ఐ నాగరాజు ఆధ్వర్యంలో చేర్యాల మండలం గుర్జకుంట క్రాస్‌రోడ్డు సమీపంలోని స్వాగతతోరణం వద్ద శుక్రవారం నిర్వహించిన వాహన తనిఖీలో రూ.65 వేల నగదు పట్టుకున్నారు. చేర్యాల పట్టణానికి చెందిన నగేశ్ కారులో రూ.65 వేలు పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.



మద్దూరు కమాన్ వద్ద పోలీసులు పట్టుకున్న నగదు

రూ.23,400 వేల మద్యం సీజ్

నంగునూరు, ఏప్రిల్ 27: నంగునూరు మండలం ముండ్రాయి బస్టాండ్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా.. (టీఎస్ 36 టీ 6861) నెంబరు గల డీసీఎంలో ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న మద్యాన్ని శనివారం పట్టుకుని సీజ్ చేసినట్టు రాజగోపాలపేట ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. సంగారెడ్డి నుంచి హుస్నాబాద్‌కు ప్రభుత్వ అనుమతి లేకుండా 144(12 కాటన్ల) బీర్లను తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. వీటి విలువ రూ.23,400 వేలు ఉంటుందని చెప్పారు. డీసీఎం డ్రైవర్ కుమార్‌ను అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక వసతులు కల్పించాలి

● జిల్లాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎన్నికల పరిశీలకులు

జహీరాబాద్/ కోహీర్ ఏప్రిల్ 27: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సంబంధిత అధికారులు ప్రతీ పోలింగ్ కేంద్రంలో మౌలిక సదుపాయాలు సక్రమంగా ఉండేలా చూసుకోవాలని సంగారెడ్డి జిల్లా ఎన్నికల పరిశీలకుడు గోపాల్‌జీ తివారి సూచించారు. శనివారం ఆయన జహీరాబాద్, కోహీర్ మండలాల్లోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించి సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు. జహీరాబాద్ పట్టణంలోని ఆదర్శపాఠశాలలోని పోలింగ్‌బూత్‌ను, బాగారెడ్డి స్టేడియం వద్ద ఈవీఎం యంత్రాల పంపిణీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అదేవిధంగా కోహీర్ మండల పరిధిలోని దిగ్వాల్, గురుజువాడ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించి పరిశీలించారు. అలాగే మండలంలోని సిద్దాపూర్ గ్రామ శివారులో ఏర్పాటు చేసిన రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద తాగునీరు, విద్యుత్, ఫర్నిచర్ తదితర మౌలిక సదుపాయాలు ఉండేలా చూడాలన్నారు. ఎన్నికల రోజు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సక్రమంగా ఎన్నికలు జరిగే విధంగా అధికారులు చూడాలన్నారు. సిద్దాపూర్ శివారులోని అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టును పరిశీలించి అక్రమంగా డబ్బు, మద్యం రవాణా కాకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఆర్డీవో రాజు, తహసీల్దార్ బాలశంకర్, ఆర్ఐ సత్యనారాయణ, ఎంపీడీవో భారతి, పోలీస్ అధికారులు ఎన్నికల సిబ్బంది తదితరులు ఉన్నారు.



కోహీర్: దిగ్వాల్‌లోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అబ్జర్వర్ గోపాల్‌జీ తివారి



కంది: ఆరుట్లలో పోలింగ్ బూత్‌ను పరిశీలించి సూచనలిస్తున్న అబ్జర్వర్ సమీర్ మహదేవ్

ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి

కంది, ఏప్రిల్ 27: మండలంలోని ఆరుట్ల, చిద్రుప్ప, ఎద్దుమైలారం తదితర గ్రామాల్లో శనివారం ఎన్నికల పరిశీలకుడు, ఐఏఎస్ అధికారి సమీర్ మహదేవ్ కర్కోటి పర్యటించారు. ఆయా గ్రామాల్లోని చెక్‌పోస్టులను, పోలింగ్ బూత్‌లను ఆయన పరిశీలించారు. పోలింగ్ బూత్‌లలో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆయన అధికారులకు సూచించారు. ఓటర్లతో మాట్లాడి ఏమైనా ఇబ్బందులు ఉంటే అడిగి తెలుసుకోవాలన్నారు. ఎన్నికల ప్రక్రియ నిర్వహణలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. ఆయన వెంట తహసీల్దార్ విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

చిన్నపిల్లలతో అమానుషంగా ప్రవర్తిస్తే చర్యలు

● నర్సాపూర్ జూనియర్ సివిల్ జడ్జి అనిత

నర్సాపూర్, ఏప్రిల్ 27: చిన్నపిల్లల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా, వారిని దండించినా చట్టపరంగా చర్యలు తీవ్రంగా ఉంటాయని నర్సాపూర్ జూనియర్ సివిల్ జడ్జి కె.అనిత పేర్కొన్నారు. శనివారం నర్సాపూర్ కోర్టులో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు చట్టాలపై అవగాహన ఉండాలనే ఉద్దేశంతో లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తూ, చట్టాల గురించి వివరిస్తున్నట్లు చెప్పారు. స్థిరాస్తుల క్రయవిక్రయాల సందర్భంగా తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. తెల్లకాగితాలపై ఎటువంటి లావాదేవీలు చేసినా అవి చెల్లవన్నారు. భార్యభర్తలు చిన్నచిన్న విషయాలకు తగాదాలు పడి విబేధాలు పెంచుకోవద్దని తద్వారా వారి పిల్లలపై ప్రభావం తీవ్రంగా ఉంటుందన్నారు. భార్యభర్తల సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవడానికి ప్రయత్నించాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు స్వరూపారాణి, శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ పుష్పరాజ్ పాల్గొన్నారు.

విగ్రాం శ్రీనివాస్‌గౌడ్‌కు గౌరవ డాక్టరేట్



ఊటీలో డాక్టరేట్‌ను అందుకుంటున్న విగ్రాం శ్రీనివాసగౌడ్

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 27: విగ్రాం రామాగౌడ్ పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్టు ద్వారా ప్రజలకు అందించిన సామాజిక సేవలకు గుర్తింపుగా ఇంటర్నేషనల్ పీస్ యూనివర్సిటీ కౌన్సిల్ జర్మన్ వారు సోషల్ సర్వీస్‌లో ట్రస్టు చైర్మన్ మాజీ ఎంపీపీ విగ్రాం శ్రీనివాస్‌గౌడ్‌కు గౌరవ డాక్టరేట్‌ను అందజేశారు. శనివారం ఇంటర్నేషనల్ పీస్ యూనివర్సిటీ గ్లోబల్ అక్రిడిటేషన్ కౌన్సిల్ జర్మనీవారు శనివారం ఊటీలో నిర్వహించిన కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ తనకు డాక్టరేట్ ప్రదానం చేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఇదే స్ఫూర్తితో ట్రస్టు ద్వారా మరిన్ని సేవాకార్యక్రమాలు చేపడతామ న్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు విగ్రాం అనీష్‌గౌడ్, చేనేతసహకార సంఘం మాజీ చైర్మన్ మహంకాళి కృష్ణమూర్తి, లోకేష్, సిద్దు, అభిమానులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సిద్ధేశ్వర జాతరలో హోరా హోరీగా కుస్తీపోటీలు

కంగ్టి, ఏప్రిల్ 27: కంగ్టి సిద్దేశ్వరుని జాతర ఉత్సవాల్లో భాగంగా శనివారం కుస్తీ పోటీలు హోరాహోరీగా సాగాయి. భగభగ మండే ఎండను సైతం లెక్క చేయకుండా మల్లయోధులు పోటీల్లో తలపడ్డారు. డప్పుచప్పుళ్ల మధ్య ఉత్సాహంగా సాగిన కుస్తీపోటీలను తిలకించేందుకు జనం భారీగా తరలి వచ్చారు. గెలుపొందిన వారికి ఆలయకమిటీ ఆధ్వర్యంలో నగదు బహుమతులు అందజేశారు. జాతర ఉత్సవాల నేపథ్యంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డిలు సిద్దేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ దారం వెంకట్, ఈవో రుద్రప్ప, విఠల్‌రెడ్డి, మనోజ్‌పాటిల్ పాల్గొన్నారు.



కంగ్టిలో కుస్తీపోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

నిబంధనలను ఉల్లంఘించిన ఎమ్మెల్యే

● రిటర్నింగ్ అధికారికి కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు

పటాన్‌చెరు, ఏప్రిల్ 27: ఎమ్మెల్యే గూడెంమహిపాల్‌రెడ్డి తన అధికారిక క్యాంపు కార్యాలయంలో పాస్టర్లతో సమావేశం నిర్వహించి ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించారని పటాన్‌చెరు ఎన్నికల రిటర్నింగ్ అధికారికి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఫిర్యాదు చేశారు. అనంతరం భారత ఎన్నికల సంఘానికి మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. మెదక్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డికి మద్దతుగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పటాన్‌చెరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పాస్టర్లతో సన్నాహక సమావేశం ఏర్పాటు చేసి ప్రార్థనలు నిర్వహించారన్నారు. మే 4వ తేదీన మరోసారి పాస్టర్లతో సమావేశం ఏర్పాటు చేసి క్రైస్తవులను మభ్యపెట్టి ఎన్నికల్లో లబ్ది పొందే కుట్రలు జరుగుతున్నాయని విమర్శించారు. ఈదుల్‌మిలాప్ కార్యక్రమం ద్వారా ముస్లిం మైనార్టీలను సైతం మభ్యపెట్టే విధంగా కార్యక్రమాలు జరుగడంపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో కాంగ్రెస్ నాయకులు సామయ్య అబ్దుల్లాపాషా, ప్రసాద్, ఎట్టయ్య, హమీద్, రమేష్, రవి, సాయిలు, ఆసిఫ్, సునంద, జ్యోతి, వెంకట్‌రావు, కిషన్, సతీష్ తదితరులున్నారు.

పౌష్టికాహారం అందించడంలో అంగన్‌వాడీలు కీలకం

నర్సాపూర్, ఏప్రిల్ 27: గ్రామీణ ప్రాంతంలోని చిన్నారులతో పాటు గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడంలో అంగన్‌వాడీ ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమని స్త్రీశిశు సంక్షేమ శాఖ రాష్ట్ర డైరెక్టర్ కె.వెస్లీ పేర్కొన్నారు. నర్సాపూర్ ఐసీడీఎస్ ప్రాజెక్టు 44వ వార్షికోత్సవం స్థానిక సాయికృష్ణ గార్డెన్‌లో సీడీపీవో హేమభార్గవి అధ్యక్షతన నిర్వహించగా ముఖ్యఅతిథిగా డైరెక్టర్ కె.వెస్లీ, జిల్లా డీడబ్ల్యూవో బ్రహ్మాజీ హాజరయ్యారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుకునే చిన్నారులు చేసిన నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా చిన్నారులతో కలిసి డైరెక్టర్, ఇతర అధికారులు కొద్దిసేపు స్టెప్పులు వేయడం విశేషం. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో డైరెక్టర్ వెస్లీ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఐదేళ్లలోపు పిల్లలకు ఆటపాటలతో పాటు విద్యనందిస్తున్నాయని గుర్తు చేశారు. చిన్నారులతో పాటు గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తూ గ్రామీణ ప్రాంతంలో పౌష్టికాహార లోపంతో బాధపడకుండా ఉండేందుకు అంగన్‌వాడీ కేంద్రాలు ఎంతగానో దోహదపడుతున్నాయన్నారు. గ్రామీణ ప్రజలు అంగన్‌వాడీల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నర్సాపూర్ ప్రాజెక్టు పరిధిలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాల పనితీరును ఆమె ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మధులత, టీఎన్జీవో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజుతో పాటు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.



చిన్నారులతో కలిసి నృత్యం చేస్తున్న డైరెక్టర్, అధికారులు

ఓపెన్ స్కూల్ పరీక్షా కేంద్రాల తనిఖీ

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 27: ఓపెన్ స్కూల్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మూడోరోజు శనివారం జిల్లా వ్యాప్తంగా పదవ తరగతి 10 కేంద్రాలు, ఇంటర్ 15 కేంద్రాల్లో ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన ఇంటర్మీడియట్ పొలిటికల్ సైన్స్ పరీక్షకు 2,649 మంది హాజరు కాగా, 275 మంది గైర్హాజరయ్యారు. పదోతరగతి మ్యాథ్స్ పరీక్షకు 1,958 మంది హాజరుకాగా, 233 మంది గైర్హారయ్యారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఇంటర్మీడియట్ కెమిస్ట్రీ పరీక్షకు 737 మంది హాజరుకాగా, 76 మంది గైర్హాజరయ్యారు. ఎస్ఎస్‌సీ బిజినెస్ స్టడీస్ పరీక్షకు 33 మంది హాజరుకాగా 8 మంది గైర్హాజరయ్యారని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. సంగారెడ్డిలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాలను డీఈవో వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు. ఆర్‌సీపురం విద్యాభారతి హైస్కూల్‌లో కాపీయింగ్‌కు పాల్పడిన ఓ విద్యార్థిని రాష్ట్రస్థాయి ఫ్లయింగ్ స్క్వాడ్ డిబార్ చేసింది.

మైనారిటీ గురుకులాల్లో నాణ్యమైన విద్య

నర్సాపూర్, ఏప్రిల్ 27: ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా నాణ్యమైన విద్యనందిస్తూ, పేద విద్యార్థులకు అన్ని వసతులతో కూడిన సౌకర్యాలను మైనార్టీ గురుకులాలు కల్పిస్తున్నాయని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి జములునాయక్ పేర్కొన్నారు. శనివారం నర్సాపూర్ మైనార్టీ గురుకులంలో ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు బాలకృష్ణ, మోహన్, అక్బర్‌అలీని సత్కరించి అభినందించారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

టేక్మాల్, ఏప్రిల్ 27: ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ పేర్కొన్నారు. మండల కేంద్రమైన టేక్మాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్యకేంద్రంలోని పలు రికార్డులను పరిశీలించారు. మందుల నిల్వలు, వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు వసతులతో పాటు వైద్యం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ పవన్, సిబ్బంది వసంత, సాయిబాబ, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

రేపు న్యాల్‌కల్‌లో దివ్యాంగులకు ఉచిత బస్ పాస్ మేళా

నారాయణఖేడ్, ఏప్రిల్ 27: ఈనెల 29న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు న్యాల్‌కల్ ఐకేపీ కార్యాలయంలో దివ్యాంగులకు ఉచిత బస్ పాస్ మేళాను నిర్వహించనున్నట్లు ఖేడ్ ఆర్టీసీ డీఎం మల్లేశయ్య, పీఆర్వో పాండు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులు ఉచిత బస్ పాస్‌ల కోసం సదరం ధ్రువపత్రం, ఆధార్‌కార్డు, దివ్యాంగుల గుర్తింపుకార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో పాటు సర్వీసు చార్జి కింద రూ.50 తీసుకురావాలని సూచించారు. ఈ అవకాశాన్ని అర్హులైన దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విశ్రాంత ఉద్యోగుల జన్మదినోత్సవం

జోగిపేట, ఏప్రిల్ 27: ఈ నెలలో జన్మదినోత్సవాలు జరుపుకుంటున్న విశ్రాంత ఉద్యోగులకు అందోలు మండల రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సామూహికంగా జన్మదిన దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ నెలలో జన్మదినాలు గల ఎం. వెంకటేశం, కే.నర్సింహాగౌడ్, వై. దుర్గారాం, రాములు, వెంకయ్యలను సంఘం ఆధ్వర్యంలోశనివారం ఆత్మానిక సత్యసాయి ఆలయంలో శాలువాలు, పూలమాలలతో సన్మానించి కేక్ కట్ చేయించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి మనోహర్ ప్రసాద్ జైన్, సభ్యులు రాంరెడ్డి, రాజయ్య, సదాశివ గౌడ్, వీరేశం, నర్సింహులు, మధుసూదన్ రెడ్డి, పాండురంగం, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించింది మోదీయే



చేగుంటలో మహిళా శక్తి సమ్మేళనంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శృతి

చేగుంట, ఏప్రిల్ 27: ప్రతీ గ్రామంలో మరుగుదొడ్లను నిర్మించుకునే విధంగా కృషి చేసి, మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్ కల్పించిన మహానాయకుడు ప్రధాని మోదీ అని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి పేర్కొన్నారు. శనివారం మండలంలోని వడియారం గ్రామంలో బీజేపీ మెదక్ జిల్లా మహిళా అధ్యక్షురాలు బెండ వీణ అధ్యక్షతన నిర్వహించిన మహిళా మోర్చా మెదక్ పార్లమెంట్ మహిళా శక్తి సమ్మేళనంలో శృతి మాట్లాడారు. మహిళా శక్తి అనుకుంటే కానిది లేదని, ప్రతీ మహిళ ఒక శక్తిలా బీజేపీ గెలుపు కోసం పనిచేస్తే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో మహిళలు మరెంతో అభివృద్ధి చెందే అవకాశం ఉందని ఆమె పేర్కొన్నారు. బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావును గెలిపించి మోదీకి కానుకగా ఇవ్వాలని పేర్కొన్నారు. అనంతరం మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల మోసపూరిత హామీలతో గద్దెనెక్కిందని, సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ మంత్రి హరీశ్‌రావులు రాజీనామా అంటూ హైడ్రామాలు ఆడుతున్నారని రఘునందన్‌రావు ఎద్దేవా చేశారు. మార్చి 19న రేవంత్‌రెడ్డి, మంత్రి హరీశ్‌రావు ఢిల్లీ నుంచి ఒకే విమానంలో ప్రయాణం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రెండు తోడు దొంగలేనని ఆయన విమర్శించారు. మెదక్ ఎంపీగా తనను గెలిపించాలని మహిళలను విజ్ఞప్తి చేశారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి దశరథలక్ష్మి, బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా నాయకురాలు సుధారాణి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల బీజేపీ మహిళా అధ్యక్షులు తుమ్మల మాధురి, ఉమ, చేగుంట బీజేపీ మండల అధ్యక్షురాలు లావణ్య బీజేపీ మండలాధ్యక్షుడు భూపాల్ పాల్గొన్నారు.

సీఎంను కలసిన పీఏసీఎస్ చైర్మన్, వైస్ ఎంపీపీ



వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డికి పార్టీ కండువాను కప్పుతున్న సీఎం

మనోహరాబాద్, ఏప్రిల్ 27: మండల కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డిని శనివారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఫుడ్‌కార్పొరేషన్ గంగుమాల్ల ఎలక్షన్ రెడ్డి, తూప్రాన్ ఉమ్మడి మండలాల పాక్స్ చైర్మన్ మెట్టు బాలకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, మండల రైతుబంధు చైర్మన్ సుధాకర్‌రెడ్డి తదితరులు సీఎం రేవంత్‌రెడ్డిని కలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఎం వారికి కాంగ్రెస్ కండువా కప్పారు. కాగా 15 రోజుల క్రితమే వారు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధును భారీ మెజార్టీతో గెలిపిస్తామని రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ నాయకులు వెల్లడించారు.

బీఆర్ఎస్ గెలిచే మొదటి స్థానం మెదక్

జిన్నారం, ఏప్రిల్ 27: రాష్ట్రంలో జరిగే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలిచే మొదటి స్థానం మెదక్ అని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం గడ్డపోతారంలో జిన్నారం, గుమ్మడిదల మండలాలు, బొల్లారం మున్సిపాలిటీ పరిధి బీఆర్ఎస్ పార్లమెంటు ఎన్నికల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. హామీల అమలులో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం తీరును గడప గడపకూ వివరిస్తూ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి గెలుపు కోసం కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బూత్‌స్థాయిలో ముమ్మరంగా ప్రచారం నిర్వహించి, విద్యావంతుడు, సమర్థుడైన వెంకట్రామారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని ఆయన సూచించారు. సమావేశంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, గుమ్మడిదల జడ్పీటీసీ కుమార్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ బాల్‌రెడ్డి, ఎంపీటీసీ వెంకటేశంగౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు రాజేష్, హన్మంతరెడ్డి, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



గడ్డపోతారంలో నిర్వహించిన బీఆర్ఎస్‌పార్టీ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

ఘనంగా బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ వేడుకలు



కందిలోని బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో జెండాను ఎగురవేస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

కంది, ఏప్రిల్ 27: పలు మండలాల్లో శనివారం బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కంది మండల కేంద్రంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండా ఎగురవేశారు. అనంతరం ఎమ్మెల్యే చింతా మాట్లాడుతూ.. తన ప్రాణాలను సైతం లెక్క చేయకుండా తెలంగాణ రాష్ట్రం సాధించిన తెలంగాణ గాంధీ కేసీఆర్ అని ఎమ్మెల్యే కొనియాడారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులను గెలిపిస్తేనే ప్రభుత్వంపై పోరాటం చేయగలమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, ఎంపీపీ కాల్వ సరళ, జడ్పీటీసీ సభ్యుడు కొండల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

● **జహీరాబాద్:** బీఆర్ఎస్‌తోనే ప్రజలు ఆశించిన అభివృద్ధి జరుగుతుందని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పేర్కొన్నారు. శనివారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో జహీరాబాద్‌లో పార్టీ ఆవిర్భావ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు దేవిశ్రీప్రసాద్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

జిన్నారం: జిన్నారంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద ఎంపీటీసీ వెంకటేశంగౌడ్ బీఆర్ఎస్ పార్టీ జెండాను ఎగురవేసి పార్టీ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, నీలం మోహన్, భిక్షపతిగౌడ్, గాండ్ల రమేష్, శ్రీనివాస్‌యాదవ్, బ్రహ్మేందర్‌గౌడ్, సంతోష్‌గౌడ్, నిఖిల్‌గౌడ్ పాల్గొన్నారు.

● **పటాన్‌చెరు:** బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పటాన్‌చెరులో నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ నేతృత్వంలో స్థానిక అంబేడ్కర్ విగ్రహం సమీపంలో పార్టీ జెండాను ఎగురవేసి వేడుకలను జరుపుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎండీ.అఫ్జల్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● **మనోహరాబాద్:** మండలంలోని కూచారంలో బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ వేడుకలను బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నాయిని ఉదయ్ రంజాన్‌గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేసి మిఠాయిలు పంచుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బుద్దుల క్రిష్టారెడ్డి, వీరేష్ గౌడ్, నందుగౌడ్, రమేష్, ప్రేమ్, నరేష్ పాల్గొన్నారు.

కాసాలలో పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ

హత్నూర, ఏప్రిల్ 27: హత్నూర మండల పరిధిలోని కాసాల (దౌల్తాబాద్) గ్రామ శివారులో గల శ్రీ పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం యాగశాల ప్రవేశం, గురుపూజ భూమి పూజ నిర్వహించారు. భక్తులకు నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

భక్తి శ్రద్ధలతో భేతాళస్వామికి బోనాలు

అల్లాదుర్గం,ఏప్రిల్ 27: స్థానిక శ్రీ భేతాళస్వామి జాతర ఉత్సవాల్లో భాగంగా 4వ రోజైన శనివారం స్వామివారికి భక్తులు బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి బోనాలను అలంకరించి గ్రామంలోని పురవీధులలో ఊరేగిస్తూ ఆలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేసి, బోనాలను భేతాళస్వామికి సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు.

ఆర్టీసీకి మరో రూ.లక్ష ఆదాయం పెరగాలి

నారాయణఖేడ్, ఏప్రిల్ 27: ప్రస్తుతం పెళ్లిల సీజన్ కొనసాగుతున్నందున ఖేడ్‌ఆర్టీసీ డిపోకు రోజుకు రూ.లక్ష ఆదాయం పెరిగేలా అధికారులు ప్రయత్నం చేయాలని ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం.ద్వివాదీనం సూచించారు. శనివారం ఆయన ఖేడ్ ఆర్టీసీ డిపోను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం స్థానిక ఆర్టీసీ డీఎం మల్లేశయ్య, సీఐ నర్సింహులుతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన డిపో పరిస్థితులు, ఓఆర్, ఆదాయం, వ్యయాలు తదితర అంశాలను సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెళ్లిళ్ల సీజన్ కావడంతో ఒక్క బస్సు కూడా క్యాన్సిల్ చేయవద్దని ఆదేశించారు.

చెట్టుకు బైక్ ఢీకొని వ్యక్తి మృతి

హవేళిఘణపూర్, ఏప్రిల్ 27: ప్రమాదవశాత్తు చెట్టుకు బైక్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన సుల్తాన్‌పూర్ శివారులో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుల్తాన్‌పూర్‌కు చెందిన గుగులోత్ లక్ష్మణ్ (46) వ్యవసాయం చేస్తూ జీవించేవాడు. శనివారం బైక్‌పై హవేళిఘణపూర్ నుంచి గ్రామానికి వెళ్తుండగా చెరువు కట్టపై అదుపుతప్పి చెట్టుకు ఢీకొనంతో అక్కడిక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహన్ని పోస్టుమార్టు నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆనంద్‌గౌడ్ తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మి, ముగ్గురు పిల్లలున్నారు. బ్రిడ్జి నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉండటం వల్లనే ప్రమాదం జరిగిందని, ఇందుకు కారకుడైన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

చెరువులో పడి వృద్ధురాలు..



నర్సమ్మ (ఫైల్)

తూప్రాన్: వృద్ధురాలు చెరువులో పడి మృతిచెందిన సంఘటన తూప్రాన్ పట్టణ పరిధి బ్రాహ్మణపల్లిలో శుక్రవారం రాత్రి జరిగింది. శనివారం తూప్రాన్ - 2 ఎస్ఐ యాదగిరి తెలిపిన వివరాల ప్రకారం.. బ్రాహ్మణపల్లికి చెందిన గంగారం నర్సవ్వ(83) కీళ్ల నొప్పులతో బాధపడుతున్నది. నొప్పుల నివారణకు చింతాకు కట్టుకోవాలని భావించి, దానిని తీసుకువచ్చేందుకు శుక్రవారం సాయంత్రం శివారులోని చెరువు వద్దకు వెళ్లింది. చెరువు వద్ద బహిర్భూమికి వెళ్లిన నర్సవ్వ ప్రమాదవశాత్తు అందులో పడి మృతిచెందింది. రాత్రి ఇంటికి రాకపోవడంతో శనివారం ఉదయం చెరువులో గాలించగా మృతదేహం లభించింది. కుమారుడు యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి..



నసీరోద్దీన్ (ఫైల్)

కోహీర్: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని దిగ్వాల్ గ్రామ శివారులో గల 65వ నంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగింది. కోహీర్ పోలీసుల కథనం ప్రకారం.. జహీరాబాద్‌లోని రంజోల్‌కు చెందిన మహమ్మద్ నసీరోద్దీన్(35) మండలంలోని మద్రి గ్రామంలో నివాసముంటున్నాడు. శుక్రవారం సాయంత్రం జహీరాబాద్‌కు వెళ్లిన నసీరోద్దీన్ తిరుగు ప్రయాణంలో రాయిపల్లి(డి) చౌరస్తా వరకు ఆటోలో వచ్చాడు. అక్కడి నుంచి మద్రి గ్రామానికి వచ్చేందుకు జాతీయ రహదారిపై నడుచుకుంటూ రోడ్డు దాటుతుండగా జహీరాబాద్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం బలంగా ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకువెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆటో డ్రైవర్..

గాజులరామారం: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆటో డ్రైవర్ మృతి చెందిన సంఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం ముట్రోజ్‌పల్లి గ్రామానికి పితాని ఆది(19) బతుకుదెరువు కోసం నగరానికి వలస వెళ్లి, గుమ్మడిదల మండలంలోని దోమడుగు గ్రామంలో భార్యతో కలిసి నివాసముంటూ, ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆటో మరమ్మతుల కోసం గాజులరామారంలోని ఓ మెకానిక్ షాపులో కోసం ఇచ్చాడు. శనివారం బైక్‌పై దోమడుగు నుంచి గాజుల రామారం వెళ్తుండగా మార్గమధ్యంలో జ్యోతి మిల్క్ కంపెనీ వద్ద వెనుక నుంచి వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి మేనమామ సున్నం సంజీవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న సూరారం పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి ..

సంగారెడ్డి క్రైం: జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు పట్టణ సీఐ ఎస్ భాస్కర్ తెలిపారు. ఈ నెల 24న ఉదయం 10గంటల సమయంలో 60సంవత్సరాల వయస్సున్న గుర్తు తెలియని వ్యక్తి గంజి మైదాన్‌లో పడి ఉండగా 108 అంబులెన్సు సిబ్బంది చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందినట్లు చెప్పారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ఆటో, ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

కొల్చారం, ఏప్రిల్ 27: ఎదురెదురుగా వస్తున్న ఆటో, ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన సంఘటన కొల్చారం మండలంలోని చిన్నాఘన్‌పూర్ సబ్ స్టేషన్ సమీపంలో శనివారం చోటు చేసుకుంది. ఏఎస్ఐ తారాసింగ్ కథనం ప్రకారం.. మెదక్ నుంచి పటాన్‌చెరు వైపు వెళ్తున్న మెదక్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు, రంగంపేట నుంచి మెదక్ వైపు వస్తున్న ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో సంగారెడ్డి జిల్లా ఎల్లాపూర్‌కు చెందిన దామోదర్, రంగంపేటకు చెందిన మొహీనుద్దీన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరిద్దరిని మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఏఎస్ఐ తారాసింగ్ తెలిపారు.

అచ్చంపేటలో గుడిసె దగ్ధం

మాసాయిపేట, ఏప్రిల్ 27: మాసాయిపేట మండలం అచ్చంపేట గ్రామంలో శనివారం తెల్లవారుజామున నిప్పు అంటుకొని గుడిసె దగ్ధమైంది. గ్రామానికి చెందిన బుడ్డ సత్తయ్య గుడిసెకు శనివారం తెల్లవారుజామున మంటలు అంటుకోవడంతో గుడిసె దగ్ధమైంది. ఆ సమయంలో గుడిసెలో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ సందర్భంగా గుడిసెల్లో ఉన్న దుస్తులు, బియ్యం, బీరువా, ఇతర విలువైన వస్తువులు కాలిపోయాయి. దాదాపు రూ.2 లక్షల నష్టం వాటిల్లినట్లు సత్తయ్య తెలిపారు. ఆర్థిక సహాయం కోసం ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

మహిళా సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



మహిళా సంఘాల సభ్యులకు స్కూల్ యూనిఫామ్స్ కుట్టడంలో శిక్షణ ఇస్తున్న దృశ్యం

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 27: మహిళా సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని అదనపు డీఆర్డీవో జంగారెడ్డి అన్నారు. సంగారెడ్డిలో మహిళా సంఘాల సభ్యులకు శనివారం యూనిఫామ్స్ కుట్టడంలో శిక్షణ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు యూనిఫామ్స్ అందించేందుకు మహిళా సంఘాల సభ్యులకు శిక్షణ నిర్వహించినట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఏపీఎం వెంకట్, డీపీఎంలు జయశ్రీ, మల్లేశం, శ్రీనివాస్, రవి పాల్గొన్నారు.

బ్యూటీ పార్లర్‌లో ఉచిత శిక్షణ

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 27: గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న మహిళలకు బ్యూటీ పార్లర్‌లో ఉచిత శిక్షణ అందిస్తున్నట్టు స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి కల్పణ శిక్షణ కేంద్రం (ఎస్‌బీఐఆర్ఎస్ఈటీఐ) డైరెక్టర్ రాజేంద్రప్రసాద్ శనివారం ప్రకటనలో తెలిపారు. తెల్లరేషన్ కార్డు కలిగి, 18 సంవత్సరాల నుంచి 45 ఏళ్ల వయోపరిమితి ఉన్నవారు ఈ శిక్షణకు అర్హులన్నారు. ఆసక్తి గలవారు తమ విద్యార్హతల పత్రాలతో సంగారెడ్డిలోని సంస్థ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఎంపికైన వారికి మే 20నుంచి నెల రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ సమయంలో ఉచిత వసతితో పాటు భోజన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. పూర్తి వివరాలకు 9490103390, 9490129839 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రాజ్యాంగాన్ని రక్షించే పార్టీకే ఓటెయ్యాలి



మాట్లాడుతున్న మాల మహానాడు నాయకులు

పాపన్నపేట, ఏప్రిల్ 27: రాజ్యాంగాన్ని రక్షించే పార్టీకే ఓటు వేయాలని జాతీయ మాల మహానాడు మెదక్ జిల్లా అధ్యక్షుడు కల్లూరు సంజీవ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఊరుట్ల శివ కోరారు. శనివారం పాపన్నపేటలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో రాజ్యాంగాన్ని రక్షించే పార్టీకి ఓటు వేయాలన్నారు. బీజేపీ భారత రాజ్యాంగాన్ని పక్కనపెట్టి మనువాదాన్ని తీసుకువచ్చే ఆలోచనలో ఉన్నదని విమర్శించారు. భారత రాజ్యాంగాన్ని కాపాడే రాజకీయ పార్టీకే తమ మద్దతు ఉంటుందని వారు తెలిపారు. సమావేశంలో మెదక్ జిల్లా గౌరవ అధ్యక్షుడు నిర్రీ ఇమ్మానియేల్, యూత్ విభాగం మెదక్ జిల్లా అధ్యక్షుడు నరేష్, నర్సాపూర్, కౌడిపల్లి మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.